క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న బాల్యమిత్రులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌కు చెందిన కుమారి రాజేందర్ (28) అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008–09లో ఏడో తరగతి వరకు చదివిన అతడి మిత్రులు ఆదివారం రాచాపూర్ వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా తాము జమ చేసిన రూ.20వేలను రాజేందర్ కుటుంబసభ్యులకు సాయంగా అందించారు.

బురద తొలగింపు



మట్టి పోస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి స్పందన

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయంగా మారడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 7న ఆదివారం చినుకు పడితే చిత్తడే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి వనిత సిబ్బంది చేత రోడ్లపై ఉన్న బురద తొలగింపజేసి మట్టి పోయించారు.

పద్మశాలి కార్యవర్గం ఎన్నిక

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం గ్రామ అధ్యక్షుడిగా రాంగణేశ్, ఉపాధ్యక్షుడిగా సబ్బని గోవర్ధన్, కార్యదర్శిగా సబ్బని రాజేశ్వర్, సభ్యులుగా రాము, సాయి, రాజు, గంగయ్య, ఆనంద్, శ్రీకాంత్ తదితరులను ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అధ్యక్షుడు తెలిపారు.

‘కడెం’కు స్వల్ప ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం ప్రాజెక్ట్‌కు 4,737 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు వస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 678.950 అడుగుల నీటిమట్టం ఉంది.

రైతుసంఘం గ్రామ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ఉపాలి

కడెం: మండలంలోని నర్సాపూర్‌లో తెలంగాణ రైతుసంఘం(అఖిల భారత కిసాన్‌సభ) గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా భూక్య రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రిషికుమార్, ఉపాధ్యక్షుడిగా సీతారాం, ప్రధాన కార్యదర్శిగా గంగారాం, సహాయ కార్యదర్శిగా చిన్నరాములు, కోశాధికారిగా భారతి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి రైతు సంఘం పోరాడుతుందని పేర్కొన్నారు.

అపరిచితులకు ఓటీపీలు చెప్పొద్దు

దస్తురాబాద్: సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీలు, సందేశాల వివరాలను అపరిచితులకు చెప్పొద్దని ఇన్‌చార్జి ఎస్సై శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని మున్యాల గ్రామంలో సైబర్ మోసాలు, మాదక ద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యువత మద్యం, మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై దివాకర్, శ్రావణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వడ్డాణం బహూకరణ



పూజలు చేయిస్తున్న శ్రీనివాస్

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన గాండ్ల కీర్తన–శ్రీనివాస్ దంపతులు ఆదివారం ముత్యాల పోచమ్మ అమ్మవారికి అరకేజీ వెండి వడ్డాణం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు నిమ్మగడ్డ శరత్‌చంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

శిథిల భవనం.. సిబ్బందికి భయం

- చిరుజల్లులకే ఉరుస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనం
- పెచ్చులూడుతున్న గదులు
- ఏటా వర్షాకాలంలో తిప్పలు
- సౌకర్యాల్లేక ప్రజల ఇక్కట్లు



వర్షానికి ఫైళ్లు తడవకుండా బీరువాలపై కవర్ కప్పిన సిబ్బంది



శిథిలావస్థకు చేరిన కార్యాలయ భవనం



పెచ్చులూడుతున్న గది

తానూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలాస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో అక్కడ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొన్ని గదులు పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా మారాయి. చిన్నపాటి వర్షాలకే భవనం ఉరుస్తుండటంతో రిజిస్టర్లు తడిసిపోతున్నాయి. భూమి రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతున్నా.. కార్యాలయంలో సౌకర్యాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించడం లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు.

30 ఏళ్ల కిందట నిర్మాణం..

మండల కేంద్రంలో 1994లో తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో భవనం పూర్తిగా శిథిలాస్థకు చేరుకుంది. దీంతో ఈ భవనంలో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. భవనం మరమ్మతుల కోసం అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న విఠల్‌రెడ్డి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చినప్పుడు అధికారులు భవనం దుస్థితి గురించి వివరించారు. స్పందించిన ఆయన భవనం మరమ్మతుల కోసం రూ.3 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు.

ఇబ్బంది పడుతున్న ప్రజలు..

తహసీల్దార్ కార్యాలయంలోనే ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో కార్యాలయానికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. కానీ సౌకర్యాలు లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కుర్చీలు, బెంచీలు లేకపోవడంతో గంటల తరబడి వరండాలో నిల్చుంటున్నారు. చెట్ల కింద గంటల తరబడి కూర్చొంటున్నారు. అధికారులు కార్యాలయంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయంలో కూర్చొనేందుకు బెంచీలు లేకపోవడంతో గంటల తరబడి నిల్చుంటున్నాం. భవనం సైతం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడూ కూలుతుందోనని భయంగా ఉంది. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేయించి.. కార్యాలయంలో సౌకర్యాలు కల్పించాలి.

– బాలాజీ, బోరిగాం

ఉన్నతాధికారుల దృష్టికి..

శిథిలావస్థకు చేరిన భవనానికి మరమ్మతు విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు మంజూరగానే మరమ్మతులు చేయిస్తాం. కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా సమస్యలు పరిష్కరిస్తాం.

– లింగంమూర్తి, తహసీల్దార్

ప్రారంభమైన ఆషాఢ బోనాలు



భైంసారూరల్: వానల్‌పాడ్‌లో బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు



నర్సాపూర్(జి)లో ఆలయం వద్ద భక్తులు

భైంసారూరల్: ఆషాఢమాసంలో నెల రోజులపాటు సాగే బోనాల వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని వానల్‌పాడ్‌లో గ్రామస్తులు పోచమ్మతల్లికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు.

నల్లమేకల పండుగ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో ఆదివారం నల్లమేకల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ గోదావరి జలాలను తీసుకొచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేశారు. అనంతరం గ్రామదేవతలకు బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అందరూ ఆయురారోగ్యాలతో బాగుండి వర్షాలు కురవాలని మొక్కుకున్నారు. అనంతరం గ్రామంలోని పలు కులసంఘాల నాయకుల ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించుకున్నారు.



ఖానాపూర్: సింగాపూర్ పెద్దమ్మతల్లి ఆలయం వద్ద బోనాలతో మహిళలు

పెద్దమ్మతల్లి బోనాలు..

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు బోనాలతో తరలివచ్చారు. వర్షాకాలం ప్రారంభంలో ప్రతీ ఆది, గురువారాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా అర్చకులు లింగన్న ఆధ్వర్యంలో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నల్లపోచమ్మకు పూజలు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో ఆదివారం నల్ల పోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. వీడీసీ ఆధ్వర్యంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు ఈటెల శ్రీనివాస్, రాజు, రవీందర్, రాహుల్ తదితరులు ఉన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



నర్సాపూర్(జి): ఉపాధ్యాయులతో 2002-03 బ్యాచ్ విద్యార్థులు



లక్ష్మణచాంద: ఉపాధ్యాయులతో 2012-13 బ్యాచ్ విద్యార్థులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో రోజంతా సరదాగా గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2012–13లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం లక్ష్మణచాందలోని రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల రోజులను గుర్తుకు తెచ్చుకొని సందడిగా గడిపారు. అంతకుముందు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజారెడ్డి, శైలజ, గంగసురేశ్, మన్మద్‌రెడ్డి, ధర్మపురి, పూర్వవిద్యార్థులు శ్రీకాంత్, సునీల్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

10న ధర్నాకు తరలిరావాలి



మాట్లాడుతున్న రాజేశ్

పెంబి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఈనెల 10న నిర్వహించే ధర్నాకు బీడీ కార్మికులు తరలిరావాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సునాకారి రాజేశ్ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని బీడీ కార్మికులతో మాట్లాడారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం కింద బీడీ కార్మికులకు రూ.4వేల జీవన భృతి, రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు హామీలు అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న, కార్మికులు ఉన్నారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, ఇస్లాపూర్, అప్పారావుపేట్, శివుని, మలక్‌జాం తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అలంకరణ, అభిషేకం, పల్లకిసేవ నిర్వహించారు. వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

కుమ్మరి సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్: కుమ్మరి సంఘం నిర్మల్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆ సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా కొత్తపల్లి రఘు, సహ అధ్యక్షుడిగా పోతుగంటి స్వామి, ప్రధాన కార్యదర్శిగా పోతుగంటి సంతోష్, కోశాధికారిగా తోడిశెట్టి శ్రీనివాస్, సిలారి సతీశ్, గౌరవ అధ్యక్షుడిగా పోతుగంటి రాములు, ఉపాధ్యక్షులుగా ఎగుడు భూమేష్ కుమార్, పోతుగంటి తుకారం, కార్యదర్శులుగా పోతుగంటి చిన్న మల్లేశ్, రాజారపు శ్రీనివాస్, రాజుర సాయన్న, పోతుగంటి సాయికుమార్ సలహా సభ్యులుగా కొత్తపల్లి గంగాధర్, భూసారపు గంగాధర్, తోడిశెట్టి రవికాంత్, కొత్తపల్లి రాజేశ్వర్, కొత్తపల్లి రమేశ్‌ను ఎన్నుకున్నారు. అంతకుముందు మహాలక్ష్మి ఆలయంలో సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ బోనాలను నైవేద్యంగా సమర్పించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



ఖానాపూర్ : జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని పాతబస్టాండ్‌తోపాటు అంబేడ్కర్‌నగర్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి బిక్కి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కుంటాల రాజన్న, మంద హరీశ్, జన్నారపు శంకర్, శెటిపెల్లి మోహన్, సంగర్తి ప్రవీణ్, జన్నారపు నరేందర్, శంకర్, దేవేందర్, నాగరాజు, ఆనంద్, మనోజ్, వంశీ, ప్రజ్యోత్, అశోక్ తదితరులున్నారు.

తానూరు: మండలంలోని హిప్నెల్లిలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ముందుగా బస్టాండ్ ప్రాంతంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సురేశ్‌వాడ్ సాహెబ్‌రావు, ముధోల్ మండలాధ్యక్షుడు సురేశ్, ఉమాకాంత్, గంగాధర్, గంగాప్రసాద్, గిరిధరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వాటర్ ప్యూరిఫైర్ అందజేత



ప్యూరిఫైర్ అందిస్తున్న సభ్యులు

నిర్మల్: జిల్లా కేంద్రంలోని సాగర్‌కాలనీలో ఉన్న డవ్ వృద్ధాశ్రమానికి పలువురు యువకులు వంద లీటర్ల వాటర్ ప్యూరిఫైర్ అందించారు. నిజామాబాద్‌కు చెందిన అక్వాఅక్షర, పవన్ ఎంటర్‌ప్రైజెస్ యజమాని పవన్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఆదివారం సంస్థ సభ్యులు వృద్ధాశ్రమంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ ఎంపీటీసీ తోట ఇంద్ర పదవీకాలం ఇటీవల ముగిసింది. ఆదివారం స్థానిక మున్నూరుకాపు కల్యాణమండపంలో ఆమెతో కలిసి 1998–99లో కన్కపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన మిత్రులు ఇంద్రను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిత్ర బృదం అంజయ్య, దేవేందర్, సురేందర్, ముత్యం, పోశెట్టి, శ్రీనివాస్, సాయన్న ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం పదవీకాలం ముగిసిన ఎంపీటీసీ చాకటి అశోక్‌ను ఘనంగా సన్మానించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆయనకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ లస్మన్న, రామారావ్, రామేశ్వర్, రమేశ్, నవీన్, రవి, భోజరాం తదితరులు ఉన్నారు.

ఆదివారం.. ఆటవిడుపు



వర్షాలు కురుస్తుండటంతో రైతులు సాగు పనులతో బిజీగా మారారు. సారంగపూర్ మండలం జామ్ గ్రామ సమీపంలోని ఓ పత్తి చేనులో తల్లిదండ్రులు కలుపుతీత పనుల్లో నిమగ్నమయ్యారు. ఆదివారం పాఠశాలలకు సెలవుదినం కావడంతో వారి వెంట వచ్చిన చిన్నారులు సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్న దృశ్యమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డును బాగు చేయరూ..



కడెం: కడెం ప్రాజెక్ట్‌కు వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: భోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్ట్, ఫోన్: 91549 51574